కోవూరులో కోర్టు భవనాల పరిశీలన


కోర్టు భవనాలు పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మంగళవారం పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విధులు నిర్వహించడం కష్టతరంగా ఉందని, నూతన భవనం నిర్మించాలని న్యాయమూర్తి చైతన్య వివరించారు. అప్పటి వరకు మరో ప్రభుత్వ భవనంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టు నిర్వహణకు సీడీపీవో కార్యాలయం, వెలుగు కార్యాలయం, కేఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలు పరిశీలించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంట కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైకాపా పాలనలో నష్టపోయాం

వెంకటాచలం, న్యూస్‌టుడే: ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు కోరారు. మంగళవారం వెంకటాచలంలోని ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాలలో వారు మాట్లాడారు. వైకాపా పాలనలో దళితులను పారిశ్రామిక వేత్తలను చేస్తామని చెప్పి, సవతి ప్రేమ చూపారన్నారు. సకాలంలో సమస్యలు పరిష్కరించకపోవడంతో తాము నష్టాల పాలయ్యామని వాపోయారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

31 నాటికి ఓటరు జాబితా తయారీ: కలెక్టర్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కృషి చేసి ఈనెల 31 నాటికి ఓటరు జాబితా తయారు చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు స్థానిక ఆయకట్టు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. ఉపాధిహామీ పని దినాలు పెంచాలని సూచించారు. జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ పన్నులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో లవన్న, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీపీవో శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ దయాకర్, పరిశ్రమలశాఖ జీఎం మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో జేసీ, డీఆర్వో

అక్రమానికి బాట!


పెన్నానదిలోకి వేసిన రోడ్డు

విధి విధానాలు రాకముందే ఇష్టానుసారం ఇసుక దోపిడీ

ఇసుకాసురులు మాఫియాగా మారి పరిధులు నిర్ణయించుకున్నారు. నదిలోకి ఏకంగా బాటలు వేసి.. ఇసుకను కొల్లగొడుతున్నారు. వీరి భరితెగింపునకు సహజ వనరు దోపిడీకి గురికావడంతో పాటు పొర్లుకట్టలు ధ్వంసమవుతుండగా- ఇదే పరిస్థితి కొనసాగితే.. ముంపు ఖాయమన్న ఆందోళన పెన్నా పరీవాహకంలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(గ్రామీణం)

నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల పరిధిలో 25 కి.మీ. వరకు పెన్నా పరీవాహక ప్రాంతాలు ఉండగా- బ్యారేజీకి ఎగువన జొన్నవాడ వైపు కొండ్లపూడి గిరిజన కాలనీ, పొట్టేపాళెం, పొర్లుకట్ట సుందరయ్య కాలనీ, మనుమసిద్ధి నగర్‌లు ఉన్నాయి. దిగువన బోడిగాడితోట, కిసాన్‌నగర్, దోసకాయల దిబ్బ కాలనీ, కోడూరుపాడు తదితర ప్రాంతాలు ఉన్నాయి. పెన్నాకు సమాంతరంగా వరద రాకుండా పలుచోట్ల పొర్లుకట్టలు ఉండగా.. పొట్టేపాళెం వద్ద ఇసుక రీచ్ ఉండేది. దీన్ని చాలాకాలం కిందటే మూసివేశారు. పొర్లుకట్ట, కోడూరుపాడు, బోడిగాడితోట ప్రాంతాల్లో ఎడ్లబండ్ల ద్వారానే ఇసుక తరలిస్తుంటారు. ఈ రెండు నియోజకవర్గాల్లో.. ఎక్కడా ట్రాక్టర్ ద్వారా తరలించకూడదు.

కిసాన్‌నగర్ వద్ద..

ప్రస్తుతం కిసాన్‌నగర్ వద్ద జాతీయ రహదారిని ఆనుకుని పెన్నాలోకి బాట వేస్తున్నారు. జనార్దన్‌రెడ్డి కాలనీ పశువుల సంత ప్రాంతంలో ఓ వ్యక్తి పెన్నా పోరంబోకును ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. పైగా అక్కడ నదిలోకి వెళ్లేందుకు మార్గం అనుకూలంగా ఉండటంతో.. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 500 వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ. 2,500 ఉండగా.. దూరాన్ని బట్టి ధర మారుతోంది. ఎక్కడికక్కడ మాఫియాగా మారి.. ఇసుక తీసుకువెళ్లే ట్రాక్టర్ల యజమానుల నుంచి ట్రిప్పుల లెక్కన డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వాహనాల ధాటికి పొర్లుకట్టలు ధ్వంసమవుతున్నాయి. భవిష్యత్తులో వరదలు వస్తే లోతట్టు ప్రాంతాలు మునగడం ఖాయంగా కనిపిస్తోంది. అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.


పొట్టేపాళెంలో నిల్వ చేసిన ఇసుక

పరిధులు.. ఏర్పరుచుకుని...

ఉచిత ఇసుక ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమై.. రీచ్‌ల ప్రారంభానికి కసరత్తు చేస్తోంది. ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తరలించుకునేందుకు పూర్తిస్థాయిలో విధివిధానాలు రాకముందే.. రాజకీయ అండతో కొందరు పరిధులు ఏర్పరుచుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా రాత్రిళ్లు పెన్నా పరీవాహక ప్రాంతాల నుంచి ఇష్టానుసారం తరలిస్తున్నారు. పొట్టేపాళెం వద్ద పెన్నాలోకి ఏకంగా రబ్బీస్ తోలి.. బాటలు వేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి నుంచి పెద్దఎత్తున ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. దోసకాయలదిబ్బ, కోడూరుపాడు ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి. రెండు రోజుల కిందట ఇక్కడికి వేరే ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ రావడంతో.. గొడవ జరిగినట్లు సమాచారం. నదిలో అక్రమంగా తవ్విన ఇసుకను పొట్టేపాళెం వద్ద నిల్వ చేసి.. రాత్రి వేళ టిప్పర్లలో చెన్నైకు తరలించి విక్రయిస్తున్నారు.

అనుమతులు ఇవ్వలేదు..

పెన్నాలో ఇసుక తవ్వుకునేందుకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకు మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్త పరిశీలన చేయాలి. ఇటీవల వర్షాల కారణంగా ఆలస్యమైంది. ప్రస్తుతానికి ఎక్కడా అనుమతి ఇవ్వలేదు.
– లాజరస్, నెల్లూరు గ్రామీణ తహసీల్దారు


నెల్లూరు చంద్రమౌళినగర్‌లో..

ఆ కట్టడాల తొలగింపు

స్పందనకు వందనం

నెల్లూరు నగరంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై నగరపాలకసంస్థ అధికారులు కొరడా ఝుళిపించారు. రహదారులపై నిర్మాణాలు చేపట్టడంపై సోమవారం 'ఈనాడు'లో 'తొలుత తాత్కాలికం.. ఆపై శాశ్వతం' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ అక్రమ నిర్మాణాలు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. వేదాయపాళెం చంద్రమౌళినగర్, బీవీనగర్‌లోని వీటిని మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. అధికారుల చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)


బీవీనగర్‌లో తొలగిస్తున్న సిబ్బంది

డ్రోన్ పరిజ్ఞానం.. అవయవదానానికి ఉపయుక్తం

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 'అమరావతి డ్రోన్ సమ్మిట్'లో నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పి.శశిధర్, పి.తిరుమలేష్, కె.వి.సాయితేజ, డి.ధీరజ్, ఎస్.డి.నవాజ్ భాగస్వాములయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రతినిధులతో.. తమ ఆలోచనలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు 'ఈనాడు'తో మాట్లాడుతూ.. 'మేము మెకానికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాం. మా కళాశాలలో ఇది వరకే పురుగు మందుల పిచికారీ డ్రోన్, తప్పిపోయిన వారిని అన్వేషించేందుకు ఉపయోగపడే వాటిని రూపొందించాం. డ్రోన్ల అభివృద్ధికి ఉపకరిస్తుందని ఈ సదస్సుకు వచ్చాం. అవయవదానం సమయంలో అంబులెన్స్‌లకు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేస్తేగానీ, సకాలంలో తీసుకువెళ్లలేని పరిస్థితి ప్రస్తుతం ఉంది. దాంతో కాలహరణాన్ని అధిగమించేందుకు డ్రోన్ల ద్వారా అవయవాలను తరలించే అంశంపై దృష్టిసారించాం. గత ఏడాది ఐఐటీ మద్రాస్‌లో జరిగిన సదస్సులో మేం తయారు చేసిన డ్రోన్లు ప్రదర్శించాం. మా ఆవిష్కరణలకు బహుమతులు వరించాయ'ని సంతోషం వ్యక్తం చేశారు.




ఎస్ఎన్‌జే డిస్టిలరీలో సీఐడీ తనిఖీలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వెంకటాచలం మండలం సర్వేపల్లి సమీపంలో.. కృష్ణపట్నం పోర్టు రోడ్డు పక్కనున్న మద్యం తయారీ సంస్థ ఎస్ఎన్‌జే డిస్టిలరీ కర్మాగారంలో మంగళవారం సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఐడీ డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో.. ఆశాఖ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి రికార్డులు పరిశీలించారు. కర్మాగారంలో మద్యం తయారీ సామర్థ్యం, నెలవారీగా సరఫరా, నిల్వలు, ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో ఎంత తయారు చేశారు? ఎవరికి సరఫరా చేశారు? తదితర విషయాలపై ఆరా తీశారు. 2019 నుంచి 2024 వరకు మొత్తం వివరాలు సేకరించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో మొత్తం నిల్వ వివరాలు నమోదు చేయడంతోపాటు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 9 గంటల వరకూ తనిఖీలు కొనసాగాయి. ఆయా వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు.


కర్మాగారంలో అధికారులు

అక్షరం.. ఆకాంక్ష

ప్రాథమిక విద్య బలోపేతం



న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

వైకాపా ప్రభుత్వంలో గాడి తప్పిన ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జగన్ సర్కారు అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 117ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. గత ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలో మూడు కి.మీ. పరిధిలోని ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రజలు, విద్యావేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో.. పరిధిని కి.మీ.కు తగ్గించింది. ఆ మేరకు 3, 4, 5 తరగతులకు సంబంధించి.. 197 ప్రాథమిక పాఠశాలల్లోని 55,628 మంది విద్యార్థులను.. దగ్గర్లోని 184 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఆ చర్యల ఫలితంగా విలీన పాఠశాలల్లో ఉపాధ్యాయుల, గదుల కొరత ఏర్పడటం, దూరం పెరగడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

పెరిగిన ఏకోపాధ్యాయ పాఠశాలలు

సదరు జీవోతో మరో సమస్య ఉత్పన్నమైంది. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పిల్లలను పంపేందుకు ఎక్కువ మంది తల్లిదండ్రులు ఇష్టపడలేదు. ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. ఇలా ఏటా ప్రవేశాలు పడిపోయాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిలో తేడా వచ్చింది. నిబంధనల ప్రకారం 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా.. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో.. ఎక్కువ మంది ఉన్న చోటుకు వారిని బదిలీ చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి. జిల్లాలో 942 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇలా జీవో నంబరు 117 చర్యలతో స్థానికంగా ప్రాథమిక విద్య అందని ద్రాక్షగా మారింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఆ జీవోను రద్దు చేసి.. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తామని తెలిపింది. ఈ నిర్ణయంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గత ప్రభుత్వం జీవో 117తో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసింది. ఆ జీవోను మొదటి నుంచి ఏపీటీఎఫ్, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం దాన్ని రద్దుచేసి ప్రాథమిక విద్య బలోపేతం చేయాలని నిర్ణయించడం అభినందనీయం. ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం రానుంది.
– ఎ.సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు


ఇరుకు గదిలో విద్యార్థులు

మూడు రోజులుండండి!

మీరు కట్టించిన ఇళ్లేగా...

విజిలెన్స్ అధికారుల నోటీసులతో సోమిరెడ్డి ఇంటికి చేరిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

వైకాపా నాయకుల ఒత్తిళ్లతోనే అక్రమాలు జరుగుతున్నా.. పట్టించుకోలేదని వ్యాఖ్య

ఈనాడు, నెల్లూరు: 'పేదలకు నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తెలిసినా.. వైకాపా నాయకుల ఒత్తిడితో ఏం చేయలేక పోయాం. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్లతోనే తప్పులు చేశామ'ని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలువురు హౌసింగ్ ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. గత పాలకులు చేసిన పాపాలకు.. ప్రస్తుతం తమకు నోటీసులు ఇస్తున్నారని వాపోయారు. మంగళవారం పెద్దఎత్తున హౌసింగ్ సిబ్బంది ఎమ్మెల్యే సోమిరెడ్డిని.. ఆయన క్యాంపు కార్యాలయం వద్ద కలిసి.. ప్రాధేయపడ్డారు. దానికి సోమిరెడ్డి స్పందిస్తూ.. 'వరిగొండ, వరకవిపూడి, వెంకటాచలం పరిధిలోని కాలనీల్లో నిర్మించిన ఇళ్లను చూస్తే మనసు తరుక్కుపోతోంది. నిరుపేదలు నివసించే ఇళ్లను అత్యంత నాసిరకంగా నిర్మిస్తుంటే ఉద్యోగులంతా ఏం చేస్తున్నారు? మీరు కట్టించిన ఇళ్లేగా? మూడు రోజులు వాటిల్లో నివాసం ఉండండి.. అప్పుడు చెప్పండి.. ఏం చేయమంటారో? ఉద్యోగులపై మాకు ఎలాంటి కోపం లేదు. పేదల ఇళ్లు దారుణంగా ఉండటంతోనే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశా. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఎవరి ప్రోద్బలంతో అక్రమాలను చూసీ చూడనట్లు ఊరుకున్నారో.. వారి వివరాలను వెల్లడించాల'ని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిలెన్స్ విచారణలో ఇప్పటికే రూ. 120 కోట్లు దుర్వినియోగమైనట్లు తేలిందని, ఇళ్ల నాణ్యతపై పరిశీలన జరిపితే.. ఇంకెన్ని అక్రమాలు వెలుగు చూస్తాయోనని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.


సోమిరెడ్డి ఇంటికి పెద్దఎత్తున చేరుకున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు.. అంతరచిత్రంలో సోమిరెడ్డితో ఆవేదన వెల్లబుచ్చుతూ..

నిర్లక్ష్యం.. ప్రాణాలు పణం

- రెండేళ్ల కిందట ఇస్కపల్లి మెరైన్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సురేశ్... విధుల్లో భాగంగా గుడూరు వెళ్లారు. ఆయన కుటుంబ సభ్యులు వెంకటగిరిలో జరిగిన జాతరకు వెళ్లి.. తిరిగి ఆటోలో నెల్లూరుకు వస్తున్నారు. అదే మార్గంలో వస్తుండటంతో.. సురేశ్ సైతం అదే ఆటోలో ఎక్కారు. కాకుటూరు సమీపంలోకి రాగానే.. ఆటో అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొట్టి పొలాల్లోకి దూసుకుపోయింది. ఆ దుర్ఘటనలో సురేశ్ చనిపోగా.. ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది.
- కొన్ని నెలల కిందట కావలి మండల పరిధిలోని రెండు గ్రామాలకు చెందిన కూలీలు.. మిరపకాయల కోతకు ఆటోలో వెళ్లారు. సుమారు 14 మందిని ఎక్కించుకున్నారు. వెళ్లే క్రమంలో అదుపు తప్పి పడిపోవడంతో.. దాదాపు అందరికీ గాయాలయ్యాయి. ఇద్దరికి కాళ్లు విరిగిపోగా.. ఇప్పటికీ మంచానికే పరిమితమయ్యారు.

- ఇవి మచ్చుకు మాత్రమే.. ఇలాంటి ప్రమాద వార్తలు ఇటీవల తరచూ వింటుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఈనాడు, నెల్లూరు: రవాణా, న్యూస్‌టుడే

జిల్లాలో నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు ఇతర పట్టణాలు, ప్రధాన గ్రామాల్లో ఎక్కడ చూసినా.. భారీ సంఖ్యలోనే ఆటోలు దర్శనమిస్తున్నాయి. నిబంధనల ప్రకారం.. వీటిలో డ్రైవరు సహా నలుగురే ప్రయాణించాల్సి ఉన్నా.. ఎక్కడా అది అమలు కావడం లేదు. 14 నుంచి 16 మందితో పలు ఆటోలు కిక్కిరిసి వెళుతుండటం మామూలైంది. మూడు చక్రాల వాహనాలు కావడంతో.. ఏ మాత్రం అదుపు తప్పినా.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో హడావుడి చేస్తున్న పోలీసులు, రవాణాశాఖ అధికారులు.. అనంతరం పట్టించుకోపోవడంతో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.



	2022	2023	2024 (సెప్టెంబరు వరకు)
క్షతగాత్రులు	982	1088	678
మరణాలు	380	433	350
ప్రమాదాలు	718	718	637

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

నిబంధనల ప్రకారం.. ఆటోలు ప్రయాణికులను ఎక్కించుకుని జాతీయ రహదారిపైకి రావడం నిషేధం. కానీ, పరిమితికి మించిన ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తుండటం.. పరిపాటిగా మారింది. దీంతో పాటు డ్రైవింగ్ నిబంధనలపై సరైన అవగాహన లేనివారు వాటిని నడుపుతుండటం సమస్యను జటిలం చేస్తోంది. ప్రధానంగా కందుకూరు, కావలి, ఉదయగిరి, అల్లూరు, పొదలకూరు, మనుబోలు, కలువాయి తదితర ప్రాంతాల్లో ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

ద్విచక్ర వాహన చోదకుల తర్వాత..

జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో ద్విచక్ర వాహన చోదకుల తర్వాత.. ఆటోలో ప్రయాణించే వారే అధికంగా మృతి చెందుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 42 వేల ఆటోలు ఉండగా.. నిరుద్యోగులు, యువతకు సులువైన ఉపాధి మార్గంగా నిలుస్తున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. భద్రతా చర్యల్లో నిర్లక్ష్యం, నిబంధనలపై అవగాహన లేకపోవడం.. ప్రయాణికులకు సంకటంగా మారుతోంది.


కందుకూరు - మాలకొండ మార్గంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో నుజ్జయిన ఆటో

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం..

రోడ్డు ప్రమాదాలపై ఇటీవలే సమావేశాలు నిర్వహించాం. ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి గల కారణాలపై చర్చించాం. ఇందులో ప్రధానంగా ఆటోలపై దృష్టిసారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా ఓవర్‌స్పీడ్, ఓవర్ వెయిట్ వెళుతున్నట్లు గమనిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. చోదకుడికి లైసెన్స్ లేకపోతే.. అతడితో పాటు ఆటో యజమానిపైనా కేసు నమోదు చేస్తాం.
– బి.చందర్, డీటీసీ, నెల్లూరు

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

నెల్లూరు(విద్య) : మాజీ సైనికుల పిల్లలకు ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకం కింద 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారిణి ఎం.పద్మజ పేర్కొన్నారు. బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీఈడీ, బీబీఏ, బీసీఏ, బీ ఫార్మసీ, బీఏ, ఎల్ఎల్‌బీకోర్సులు చదువుతున్న మాజీ సైనికుల పిల్లలు నవంబరు 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంని, వివరాలకు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలనన్నారు.

బీమా పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సదస్సులు


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(కలెక్టరేట్): కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బ్యాంకర్లు అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ వరకు సదస్సులు నిర్వహించాలని తెలిపారు. సదస్సులకు వచ్చే వారిలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమాకు ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాదబీమా, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమాకు ఏడాదికి రూ.436 చెల్లిస్తే 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు ఎటువంటి మరణం సంభవించినా రూ.2లక్షలు కేంద్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. డీఆర్డీఏ శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ.7,509
(3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	
సవర ధర:	రూ.60,072
వెండి గ్రాము:	రూ.103.60

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	122
రిటైల్	144
లేయర్	115
బ్రాయిలర్	209
బ్రాయిలర్ స్కిన్‌లెస్	238
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	132
లేయర్	115
బ్రాయిలర్	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	195


మాట్లాడుతున్న పొగాకుబోర్డు ఈడీ శ్రీధర్‌బాబు

నాణ్యమైన దిగుబడితో అధిక లాభాలు

కందుకూరు పట్టణం: నాణ్యమైన పొగాకు దిగుబడితో మంచి లాభాలు పొందాలని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. కందుకూరు-1 వేలం కేంద్రంలో మంగళవారం వేలం ముగింపు సందర్భంగా పొగాకు రైతులు, వ్యాపారులతో సభ నిర్వహించారు. ఈడీ మాట్లాడుతూ అనుమతి మేరకే సాగు చేయాలని, అధిక ధరలకు భూములు, బ్యారన్లు తీసుకుని నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణ్‌రావు, బోర్డు కార్యదర్శి వేణుగోపాల్, సీటీఓ శర్వాణి, వేలం నిర్వహణాధికారి ఎం.కిరణ్ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: బోర్డు అనుమతించిన మేరకు పొగాకు పంటను సాగు చేయాలని కందుకూరు వేలం కేంద్ర నిర్వహణాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లెలో పొగాకు పెంపకం, ఎరువుల వినియోగం, నర్సరీల్లో చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలు కంపెనీల ప్రతినిధులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

సెనగ విత్తనాల ధర ఖరారు
25 శాతం రాయితీ

పంపిణీ ఇలా..

విస్తీర్ణం (ఎకరాల్లో)	ఇచ్చే బస్తాల సంఖ్య
0.50	1
0.51–1	2
1.01–1.50	3
1.51–2	4
2.01–2.50	5
2.51–3	6
3.01–3.50	7
3.51–4	8
4.01–4.50	9
4.51–5	10


దుత్తలూరులో సాగుకు సిద్ధం చేసిన పొలం

న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

రబీలో వర్షాధారంగా సెనగ సాగు చేయడానికి రైతులు సన్నాహాలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఈ మేరకు విత్తనాల ధరలను ఖరారు చేశారు. సెనగ, సరఫరా బాధ్యతలను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసేందుకు జిల్లా వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు కురవడంతో ఈసారి అధిక విస్తీర్ణంలో సాగు చేయడానికి రైతులు భూములు దుక్కులు దున్ని సమాయత్తం అవుతున్నారు.

జిల్లాలో మెట్ట ప్రాంతాలైన దుత్తలూరు, వరికుంటపాడు, కలిగిరి, కొండాపురం, వింజమూరు, ఉదయగిరి, జలదంకి, అనంతసాగరం, ఆత్మకూరు తదితర మండలాల్లో ఏటా 45 వేల హెక్టార్లలో సాగు జరుగుతోంది. ఈసారి పెరిగే అవకాశం ఉంది. జె.జి-11 రకం విత్తనాలు 5 వేల క్వింటాళ్లు, కాగ్-2 రకం విత్తనాలు ఏడు వేల క్వింటాళ్లు ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఖరీఫ్‌లో కర్షకులకు కాలం కలిసి రాలేదు. దీంతో రబీపై ఆశలు పెట్టుకున్నారు. అధికారులు విత్తనాలు పంపిణీ చేస్తే సాగు చేసుకుంటామని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది 40 శాతం రాయితీపై పంపిణీ చేశారు. ఈ సారి 25 శాతానికే పరిమితం చేయడంతో కొంత నిరాశతో ఉన్నారు. సెనగ విత్తనాలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 30వ తేదీ లోగా పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, దరఖాస్తు పత్రం, వెబ్‌ల్యాండ్ నంబరుతో రిజిస్టర్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రాయితీ ఇలా..

రకం	పూర్తి ధర (రూ.)	రాయితీ (రూ.)	రైతు చెల్లించాల్సింది (రూ.)
జేజీ-11	9,400	2,350	7,050
కాగ్-2	12,100	3,025	9,075

నాణ్యమైన విత్తనాల పంపిణీ
సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారిణి
బయట మార్కెట్లో లభించే విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు. ప్రభుత్వం తరపున నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పంపిణీలో ఎక్కడా కూడా రాజీపడం.

నిరుద్యోగ యువతీ, యువకుల కలలు సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీ అమలులో భాగంగా ఇప్పటికే టెట్ పరీక్షను చేపట్టగా త్వరలో మెగా డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. పరీక్ష రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణ కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది.



శిక్షణ.. కొలువులకు ప్రేరణ

న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య, వేదాయపాలెం)

డీఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు డీఎస్సీ అభ్యర్థులను ఊరించి ఉసూరుమనిపించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తూ.. సన్నద్ధతలో తాము పోటీ పడలేకపోయామనే భావన యువతలో రాకుండా చర్యలు తీసుకుంటోంది. అన్ని విభాగాల అభ్యర్థుల శిక్షణకు తోడ్పాటునందిస్తున్నారు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత బోధనతో పాటు వసతి, భోజన సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. నవంబర్ రెండున వెలువడే టెట్ ఫలితాలు, స్క్రీనింగ్ పరీక్షలో వచ్చే మార్కులను పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేసి వారికి బోధన, వసతి, భోజన సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల్లో వీరికి ఉచిత బోధన అందించనున్నారు.

నవంబరు 5నుంచి తరగతులు
నవంబరు 5 నుంచి తరగతులు ప్రారంభించి డీఎస్సీ పరీక్ష తేదీవరకు అనుసంధానంగా శిక్షణ ఇవ్వనున్నారు. సాధారణంగా బ్యాంకింగ్, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ గతంలో ఇచ్చేవారు. ఈ సారి ప్రభుత్వం ఎంపిక చేసిన సంస్థల నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఎంపిక చేసిన మూడు కేంద్రాల్లో
డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎంపిక చేసిన తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలోని కేంద్రాల్లో అభ్యర్థులకు వారు కోరుకున్న చోట ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా కూడా ఇవ్వనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. దీనికి జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్‌ను జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే సిద్ధం చేసి ఉంచారు. ఐదుకు అనుమతులు రావాల్సి ఉందని బీసీ వెల్ఫేర్ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో నిరుద్యోగులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల ద్వారా జిల్లాలోని నిపుణులైన ట్యూటర్ల ద్వారా పలు పోటీ పరీక్షలకు అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చే వారు. జిల్లాలో 600 మందికి పైగా శిక్షణ పొందారని నిపుణులు పేర్కొంటున్నారు.

25లోగా నమోదు చేసుకోవాలి
వి.శ్రీనివాసులు సోషల్ వెల్ఫేర్ డీడీ
ఉచిత శిక్షణకు అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వారికి చిన్నపాటి స్క్రీనింగ్ నిర్వహించి ఉచిత శిక్షణకు ఎంపిక చేయనున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అర్హులైన అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల కట్టడి

ఈనాడు, అమరావతి: సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట వేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పిలుపునిచ్చారు. కేసుల దర్యాప్తుల్లో సాంకేతికతను జోడిస్తే ఫలితాలు వేరుగా ఉంటాయని చెప్పారు. ఇటీవల బాపట్ల జిల్లా మేదరమెట్ల స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ దారి దోపిడీని కేవలం 48 గంటల్లో ఛేదించడానికి ఆ పరిజ్ఞానమే దోహదపడిందన్నారు. మంగళవారం సాయంత్రం రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలతో ఆయన గుంటూరులోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబునాయుడు నివాసంపై గతంలో జరిగిన దాడుల కేసుల పురోగతి, ఆధారాలు ఎలా సేకరించిందీ ఎస్పీలకు వివరించారు. రఘురామకృష్ణరాజు కేసు పురోగతిపైనా చర్చించారు. ఎస్పీలు సతీష్‌కుమార్ కె.శ్రీనివాసరావు, తుషార్ డూడీ, దామోదర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

మహిళను ఏమార్చి.. బంగారు గొలుసు అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న మహిళ వెనక నుంచి వచ్చి గొలుసు లాక్కొని వెళ్లిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది... పోలీసుల కథనం మేరకు.. కాగులపాడుకు చెందిన బాబయ్య, అరుణమ్మ దంపతులు సోమవారం ద్విచక్రవాహనంపై పెనుబల్లికి బయల్దేరారు. మధ్యలో పెట్రోలు అయిపోవడంతో.. ఆ మార్గంతో వెళుతున్న యువకుడిని ఆపి తన భార్యను పెనుబల్లి వద్ద వదలాలని కోరారు. ఆ యువకుడు అరుణమ్మను ద్విచక్రవాహనంపై పెనుబల్లికి తీసుకెళుతున్నట్లు నటించి, కొంత దూరం వెళ్లిన తర్వాత మూత్ర విసర్జనకంటూ బండిని ఆపారు. ఆపై మహిళను ఏమార్చి.. ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

మరణంలోనూ వీడని స్నేహం
ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఇద్దరి దుర్మరణం

మనుబోలు, న్యూస్‌టుడే: వారిద్దరు స్నేహితులు.. ఏ పనిచేయాలన్నా కలిసే ఉంటారు.. ఎంతో ఆప్యాయంగా ఉన్న వారిపై విధి చిన్నచూపు చూసింది.. బస్సు రూపంలో మృత్యువు వెంటాడింది.. కారు కొనుగోలు చేసేందుకు వెళ్లి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు.. ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వారిపై దూసుకెళ్లడంతో స్నేహితులిద్దరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మనుబోలు మండలం బద్దెవోలు అడ్డరోడ్డు సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... తిరుపతి జిల్లా కోట మండలం విద్యానగర్‌కు చెందిన సిద్దారెడ్డి వెంకటరమణారెడ్డి(60), పౌణకా వెంకటసుబ్బారెడ్డి(60) స్నేహితులిద్దరూ కారు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై నెల్లూరు బయల్దేరారు. అనంతరం స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. గూడూరు డిపో ఆర్టీసీ బస్సు కొలను కుదురు వెళుతుండగా, బద్దెవోలు అడ్డరోడ్డు కూడలిలో మలుపు తిరుగుతూ అదుపుతప్పి నెల్లూరు నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో వెంకటరమణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటసుబ్బారెడ్డి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాకేశ్ తెలిపారు.

డీకే కళాశాలలో మిగిలిన సీట్లకు నేరుగా ప్రవేశాలు

నెల్లూరు(విద్య) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు ఉదయం పది గంటలకు అసలు ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

బాలికపై అత్యాచారం.. నిందితుడికి యావజ్జీవం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: *ప్రేమ పేరిట మాయమాటలు చెప్పి బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.26,000 జరిమానా విధించింది. ప్రత్యేక పీపీ సునీత కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పోతురాజుమిట్ట గ్రామానికి చెందిన తన్నీరు రాజు అలియాస్ చిన్నపోతు రాజు (27) నగరానికి వలస వచ్చి మేస్త్రీ పనులు చేస్తున్నాడు. 2017లో బాలాపూర్ ఠాణా పరిధిలో నూతన భవన నిర్మాణ సమయంలో ఓ బాలిక(14)తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నట్లు నమ్మించి, బాలికను తీసుకెళ్లి శ్రీకాకుళం జిల్లాలోని ఓ గ్రామంలో బంధువుల ఇంట్లో బంధించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదుతో బాలాపూర్ పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తుది తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.10 లక్షలు పరిహారాన్ని మంజూరు చేశారు.*

మాటామాట పెరిగి హత్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో జరిగిన హత్య కేసులో ఏ2 నిందితుడిని చిన్నబజారు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి కథనం మేరకు.. ఈ నెల 15న తెల్లవారు జామున మార్కెట్‌లో యువకుడు వాక అశోక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో హత్య చేసి పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితులు పాత నేరస్థులు గోని రాము, పసుపులేటి సందీప్‌గా గుర్తించారు. మార్కెట్‌లో పనిపూర్తి చేసుకుని టిఫిన్ చేసేందుకు అశోక్ రాగా.. అదే సమయంలో రాము, సందీప్ వచ్చారు. గతంలో వీరంతా పాత నిందితులే. వారి మధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలో రాము తన వెంట తెచ్చుకున్న కత్తితో అశోక్‌ను దారుణంగా హత్య చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతనిపై పలు స్టేషన్లలో కేసులు ఉన్నాయి. ఏ1 రాము పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ చిట్టేటి కోటేశ్వరరావు తెలిపారు.

నిందితుడి అరెస్టు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మెరిసిన ప్రతిభ


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు కొండపనాయుడు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని గాయత్రినగర్ వీఏఎస్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వైఎంఎల్ పావని, బి.గౌతమి, పి.నిస్సిప్రవచనకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండపనాయుడు బహుమతులు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుడ్లూరు: చెమిడిదిపాడు బస్టాండు వద్ద నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి కందుకూరుకు చెందిన గుండవరపు నరసింహారావు, శారద దంపతులు మంగళవారంరూ.16 వేలు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

పుర ఎన్నికలకు సన్నద్ధం!

కావలి, న్యూస్‌టుడే : పురపాలక ఎన్నికలకు అవరోధాలు తొలుగుతున్నాయి. త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈమేరకు చర్యలు తీసుకుంటుంది. గత వైకాపా పాలనలో పురపాలకంలో చౌదరిపాలెం గ్రామ పంచాయతీని విలీనం చేశారు. దీనిపై గ్రామస్థులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో 2019లో ఎన్నికలు తలపెట్టగా వీలుకాలేదు. రాష్ట్రంలో పాలన మారడంతో ఈ పంచాయతీ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లగా సానుకూలంగా స్పందించారు. గ్రామాన్ని విడదీసేందుకు అంగీకరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఇటీవల ప్రకటించారు.

దుర్బుద్ధితోనే అడ్డంకులు: డీవీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే

గతంలో ఉన్న ఎమ్మెల్యే రాజకీయ కోణంలోనే పురపాలక సంఘం ఎన్నికలు జరగకుండా అడ్డుకున్నారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగా త్వరలో ఎన్నికలు జరిగేలా చూస్తాం. పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి బాట పట్టిస్తాం.

సాగుతున్న పనులు ప్రజలకు ఇబ్బందులు


అధ్వానంగా రహదారి

న్యూస్‌టుడే, దగదర్తి, కావలి

ముంబయి జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మించే దగదర్తి - బుచ్చి రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అయిదేళ్లుగా పనులు నిలిచిపోయాయి. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేగవంతమవుతాయని ప్రజలు భావించారు. అందుకనుగుణంగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి గుత్తేదారులతో మాట్లాడి నెల రోజుల క్రితం ప్రారంభించారు. అయినా పూర్తి స్థాయిలో మొదలు కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రహదారిలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

అనుసంధాన మార్గం ఏర్పాటులో జాప్యం

నిర్మాణంతో అనుకూలం

జిల్లాలోని దగదర్తి ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. దామవరంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. కౌరుగుంట, లయన్స్‌నగర్‌లో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఆక్వా ఆధారిత పరిశ్రమలతో ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. దీంతో ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం రహదారుల నిర్మాణం చేపట్టింది. ఈమేరకు విమానాశ్రయానికి ముంబయి రహదారిని కలుపుతూ బుచ్చిరెడ్డిపాళెం వరకు రహదారి నిర్మాణం చేపట్టారు. అల్లూరు, దగదర్తి, బుచ్చి మండలాలను కలిపే ఈ రహదారితో కడపతో పాటు మరికొన్ని జిల్లాలకు రవాణా సౌకర్యం కలుగుతోంది. సున్నపుబట్టి నుంచి అల్లూరు మండలంలోని సింగపేట వరకూ రెండు వరుసలుగా నిర్మించి ఉలవపాళ్ల - అల్లూరు రహదారికి కలిపారు. మరో విడతలో సున్నపుబట్టి నుంచి దగదర్తి వరకు రెండు వరుసలుగా అభివృద్ధి చేశారు. దగదర్తి గ్రామంలో సిమెంటు రహదారి పూర్తయింది. ఇక్కడి నుంచి బుచ్చిరెడ్డిపాళెం వరకూ రెండు వరుసల రహదారి నిర్మాణం జరుగుతోంది. రూ. 40 కోట్ల ప్రత్యేక ప్యాకేజీతో ఈ ఈ నిర్మాణాన్ని చేపట్టారు. పైడేరు వాగుపై వంతెన పూర్తి చేశారు. ఇన్ని పనులు చేసినా గత ప్రభుత్వం నిధులు విడుదల చేయక ఇబ్బందులకు గురిచేయడంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు.


వంతెన వద్ద కోసుకుపోయిన రోడ్డు

ఉన్నతాధికారులు పరిశీలించాక చేస్తాం

గతంలో జరిగిన పనులను ర.భ. శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి నమోదు చేయాల్సి ఉంది. రెండు రోజుల్లో పరిశీలిస్తారు. అనంతరం వేగవంతం చేయించి త్వరితగతిన పూర్తి చేస్తాం.

నాగరాజు, ర.భ.శాఖ ఏఈ

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : స్థానిక గ్రంథాలయం ఎదురు వీధిలో సిమెంటు రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరుగుతున్నాయి. **-బి.శ్రీనివాస్, స్థానికుడు**

సమాధానం : కాలువ తీయించి నీరు నిల్వ కాకుండా చూస్తాం. **- వెంకటేశ్వరరావు, ఎంపీడీవో - గుడ్లూరు, న్యూస్‌టుడే**

? ఇందిరమ్మ కాలనీలో సిమెంటు రోడ్లు లేవు. వానాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. **- శ్వేతకేతు, ప్రైవేట్ ఉపాధ్యాయురాలు, ఇందిరమ్మ కాలనీ**

✓ నుడా నిధులు రూ.10 కోట్ల వరకు త్వరలో రానున్నాయి. రాగానే రోడ్లు నిర్మిస్తాం. **- శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం**

? ఉలవపాడులోని కృష్ణానగర్, రైల్వే రోడ్డులో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. **-శ్రీకాంత్, ఉలవపాడు**

✓ రెండు రోజుల్లో పరికరాలు వస్తాయి. రాగానే బాగు చేస్తాం. **- వీరయ్య, పంచాయతీ కార్యదర్శి - ఉలవపాడు, న్యూస్‌టుడే**

భూ సేకరణ పూర్తిచేయండి

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టులకు త్వరితగతిన భూ సేకరణ చేపట్టాలని జేసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూసేకరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ఏఐ, రైల్వే, ఆర్‌వోబీలు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు భూ సేకరణ వెంటనే పూర్తి చేయాలన్నారు.

అడుగు వేయాలంటే అవస్థలే !

మండలంలోని జడదేవి నుంచి తూర్పుచెన్నంపల్లె వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. చినుకు పడితే అడుగు వేసేందుకు వీలు కావడం లేదు. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారి తెలిపారు. **- న్యూస్‌టుడే, వరికుంటపాడు**



కంపచెట్లు తొలగించరూ...!



సీతారామపురం నూతివారికొట్టాలు నుంచి పీరారెడ్డి కొట్లాలు, కసరకుంటకు వెళ్లే మార్గంలో కంప చెట్లు విపరీతంగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు, గ్రామస్థులు తెలిపారు. రహదారిని కమ్మేయడంతో ద్విచక్రవాహన చోదకులు గాయపడుతున్నారు. దీన్ని పంచాయతీ సర్పంచి కొడవటికంటి భాగ్యకుమారి దృష్టికి తీసుకెళ్లగా చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, సీతారామపురం**

ఇది ఉద్యానవనమేనా!

పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతంలో అయిదెకరాల్లో ప్రతిపాదించిన మెగా పార్కు ప్రస్తుతం కంపచెట్లతో అధ్వానంగా తయారైంది. గతంలో పార్కు ఏర్పాటు పేరుతో రూ.లక్షలు నిధులు ఖర్చు చేశారు. అనంతరం ఎంఐజీ లేఅవుట్‌లో కలిపి అభివృద్ధి చేస్తామని అధికారులు చెప్పినా చేయలేదు. ప్రస్తుతం పిచ్చిమొక్కలు, చిల్ల చెట్లతో నిండింది. వీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. **- కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే**



విద్యుత్తు స్తంభం ప్రమాదకరం



గ్రామంలోని నేరేడుపల్లి రోడ్డులో గ్రంథాలయం వద్ద ప్రధాన రహదారి పక్కన ఒరిగిన విద్యుత్తు స్తంభంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇది కూలకుండా చెట్ల మొద్దులు స్థానికులు అడ్డుగా పెట్టారు. తీగలు కూడా వేలాడుతున్నాయి. ఈ విషయమై డిస్కం ఏఈ షేక్ నాగూర్‌వలి మాట్లాడుతూ మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. **- వింజమూరు, న్యూస్‌టుడే**

వంతెన ప్రాంతం.. దుర్గంధభరితం

గ్రామంలోని బస్టాండ్ కూడలి సమీపంలో వంతెన వద్ద చెత్త పేరుకుపోయింది. అక్కడ పందులు తిరుగుతుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి రామానాయ్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. **- సీతారామపురం, న్యూస్‌టుడే**



సంక్షిప్త సమాచారం

శాస్త్రీయ విధానంతో ముందడుగు

సీతారామపురం : రైతులకు రాయితీపై బిందు, తుంపర పరికరాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. మండలం నెమళ్లదిన్నె, గంగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో సాంబశివయ్య, వీఏఏ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు : పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. మండలంలోని నల్లబోతులవారిపల్లెలో పీఎం కిసాన్ లబ్ధిదారులకు మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. తూర్పుబోయమడుగుల, కాంచెరువులో రైతు సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఆదిత్య, పవన్, రైతులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి

లింగసముద్రం : విత్తన శుద్ధితో వరిలో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి అబ్రహాం లింకన్ తెలిపారు. మంగళవారం చినపవని, అన్నేబోయినపల్లిల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులకు అవస్థలు

కొండాపురం: కొన్నాళ్లుగా మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సు పరికరాలు పనిచేయడం లేదు. దీంతో జిల్లా అధికారులు నిర్వహించే కాన్ఫరెన్సులకు కలిగిరి, కావలి, జలదంకి మండలాలకు అధికారులు వెళుతున్నారు. ఈవిషయమై తహసీల్దారు కోటేశ్వరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సాంకేతిక సమస్య తలెత్తిందని, సంబంధిత సిబ్బందికి తెలియజేశామన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన

వలేటివారిపాలెం : మిరప, పొగాకు సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.ప్రసాద్‌బాబు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని అంకభూపాలపురంలో ఏవో హేమంత్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సహాయకులు రవీంద్ర, నాగరాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి కృషి

కావలి : గిరిజన సంక్షేమానికి పాటుపడతామని తెదేపా నాయకులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కావలి గిరిజన నాయకులు మొగిలి కల్లయ్య సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి మంగళవారం తాడేపల్లిలో తీసుకెళ్లారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని చెప్పారు.

విద్యార్థులు శాస్త్రీయ విద్యా విధానాన్ని అలవరుచుకోవాలి

కందుకూరు పట్టణం : విద్యార్థులు శాస్త్రీయ విద్యా విధానం సాగించాలని అందుకోసం పోరాడుతున్న పీడీఎస్‌యూ వంటి సంస్థలకు అండగా నిలవాలని టీఆర్ఆర్ కళాశాల అధ్యాపకుడు సి.హెచ్.శ్రీనివాస్ తెలిపారు. పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా అక్టోబరు 24న హైదరాబాద్, నవంబరు 5న విజయవాడలో సభలు జరుగుతాయన్నారు. దీనిపై గోడపత్రికలను మంగళవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు.


అయోడిన్ ఉప్పు మేలు

సీతారామపురం : కూరల్లో అయోడిన్ ఉప్పు తప్పక వినియోగించాలని వైద్యాధికారిణి స్వప్న సూచించారు. సీతారామపురం కేజీబీవీ పాఠశాలలో మంగళవారం అయోడిన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కృష్ణమ్మ, ఎంపీహెచ్ఈవో మజీదు, ఆరోగ్య సహాయకుడు శ్రీనివాసులు, ఏఎన్ఎం వెంకటరత్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

గుడ్లూరు : సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరుపాడులోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాత పుస్తకాలు, నీటి డబ్బాలు, భోజన పళ్లేలను ఎస్సై వెంకటరావు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు బి.నారాయణ, దాతలు రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దోమల ఉత్పత్తి కేంద్రంగా నీటి కుంట



గ్రామంలోని కోనేరు సమీపంలో వెంగనగుంత దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఇందులో మురుగునీరు చేరడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సమీప ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

-న్యూస్‌టుడే, అల్లూరు

ప్రతిభా వికాసం


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేసిన ఉపాధ్యాయులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. సి.హెచ్.ఆకర్ష, కె.వేదశ్రీ, జి.మోక్షితసాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ బాలభాస్కర్, డీన్ ఎం.వి.రామారావు, ప్రిన్సిపాళ్లు ఎస్.మల్లికార్జున, సునీత అందజేశారు.

25న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.మస్తానయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **ఉదయగిరి :** స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆకుల నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి గర్భిణికి అన్నిరకాల పరీక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ప్రతి గర్భిణిని గుర్తించి పేరు నమోదు చేయాలని, అన్ని రకాల పరీక్షలు తప్పని సరిగా చేయాలని డీఎంహెచ్‌వో పెంచలయ్య తెలిపారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాతా శిశు మరణాల సబ్‌కమిటీ సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది.

అనుమతిస్తే నష్టపోతాం

క్వార్ట్జ తవ్వకాలపై గ్రామస్థుల అభ్యంతరం


మాట్లాడుతున్న ఆర్డీవో వంశీకృష్ణ

దుత్తలూరు, న్యూస్‌టుడే : క్వార్ట్జ తవ్వకాలకు అనుమతి ఇస్తే నష్టపోతామని, పశువులకు మేత దొరకదని మండలంలోని లక్ష్మీపురం గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. గ్రామంలో క్వారీ ఏర్పాటుపై మంగళవారం కావలి ఆర్డీవో వంశీకృష్ణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో తవ్వకాలతో పంటలు నాశనమయ్యే ప్రమాదముందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్, కావలి డీఎస్పీ శ్రీధర్, తహసీల్దారు నాగరాజు, ఎస్సై ఆదిలక్ష్మి, పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై నిలిపిన వాహనాన్ని ఢీకొని మృతి

కావలి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై సంకేతాలు చూపకుండా నడిరోడ్డుపై భారీ వాహనం నిలపడంతో వెనుకనే వచ్చిన మరో వాహనం ఢీకొనగా ఒకరు మృతి చెందారు. ఈఘటన మంగళవారం కావలి శివారులోని మద్దూరుపాడు వద్ద జాతీయరహదారిపై జరిగింది. విశాఖపట్నం నుంచి ఐరన్ లోడుతో వెళ్తున్న ట్రాలీని చోదకుడు రహదారి పక్కన నిలిపివేశాడు. దీన్ని వెనుకగా వచ్చిన లారీ ఢీకొనగా డ్రైవర్ సుందర శ్రీనివసరావు (53) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాన్ని కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. గ్రామీణ పోలీసు స్టేషన్ ఎస్సై ఎం. బాజీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు

ఉలవపాడు, న్యూస్‌టుడే : జాతీయరహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకుడికి గాయాలైనట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఉలవపాడు- రాజుపాలెం మధ్య జేబీ డాబా సమీపంలో జాతీయరహదారిపై కావలి వెళుతున్న ఆర్టీసీ బస్సు రోడ్డుపై అడ్డంగా వచ్చిన భిక్షాటన చేసే వ్యక్తిని ఢీకొంది.

జూద స్థావరం పై దాడి

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాలలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఎస్సై వెంకట్రావు మంగళవారం సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ. 1300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది రమేష్, సుబ్రహ్మణ్యం, కృష్ణ ఉన్నారు.

శివాలయంలో చోరీ

అల్లూరు : గ్రామంలోని శివాలయంలో మంగళవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి మంగళసూత్రం, చెవుల ఆభరణాలు చోరీ చేశారు. ఉదయం అర్చకులు రాగా తలుపులు పగులగొట్టినట్లు గమనించారు. లోపలకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కిషోర్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నా రికార్డు చేసే హార్డ్‌డిస్క్ పనిచేయడం లేదని గుర్తించారు.

విద్యుత్తు మోటార్ల రాగి తీగ..

గుడ్లూరు, న్యూస్‌టుడే గ్రామంలోని రెండో సచివాలయం సమీపంలోని తోటల్లో గుర్తు తెలియని వ్యక్తులు మోటార్లలోని రాగి తీగను అపహరించారని బాధిత రైతులు మాల్యాద్రి, ప్రకాశరావు, రవి తెలిపారు. సోమవారం మామిడి తోటలో ఉన్న మోటార్ల తీగలు మంగళవారం ఉదయానికి కనిపించలేదన్నారు. రూ.20 వేల విలువైన తీగలు అపహరించారని వాపోయారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్‌కలెక్టర్ శ్రీపూజ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈనెల 23 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ టి.శ్రీపూజ అధ్యక్షతన నియోజకవర్గంలోని అయిదు మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాస్తవ హక్కుదారుల జాబితాలను తహసీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు.

రీసర్వే సమస్యలపై..

కలిగిరి : గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో తలెత్తిన సమస్యల సవరణకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని తహసీల్దారు రవీంద్రబాబు తెలిపారు. మండలంలోని రావులకొల్లులో మంగళవారం జరిగిన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరించారు. **జలదంకి :** భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ ఎం.ప్రమీల తెలిపారు. మంగళవారం మండలంలోని కోదండరామపురంలో గ్రామసభ నిర్వహించారు. కావలి డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, రీ సర్వే ఉపతహసీల్దార్ శాంసన్, వీఆర్వో రంతుల్లా, గ్రామ సర్పంచి బి.వి.కృష్ణారెడ్డి, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. ఇళ్లు పూర్తి కాక


కొండాపురం లే అవుట్‌లో నిర్మాణం నిలిచిపోయిన ఇళ్లు

న్యూస్‌టుడే, కొండాపురం, ఉదయగిరి

ఇళ్లు కాదు కాలనీలే నిర్మిస్తాం.. పేదలకు గూడు ఏర్పాటుచేస్తాం: ఇవీ వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా పదేపదే చెప్పిన మాటలు. అయిదేళ్లు గడిచాయి. కాలనీలు కాదు.. ఇళ్లు కూడా నిర్మించలేదు. మాటలు చెప్పినంతగా క్షేత్రస్థాయిలో పనులు కనిపించలేదు. దీంతో పేదలు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కాకుండా ఉన్నాయి. మండలంలో పేదలకు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో ఎక్కడ చూసినా అరకొర నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. మండలంలో 19 పంచాయతీలు, 52 మజరా గ్రామాలున్నాయి. వీటి పరిధిలో గత వైకాపా ప్రభుత్వం హయాంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్లు కేటాయించారు. 21 లేఅవుట్లు వేశారు. వీటిలో మూడు చోట్ల వివాదాలు తలెత్తగా పెండింగ్‌లో ఉన్నాయి. 19 లేఅవుట్లలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వీటిల్లో కూడా ఆరుచోట్ల మాత్రమే ఇళ్ల నిర్మాణానికి పలువురు లబ్ధిదారులు ముందుకొచ్చారు. మిగిలిన ప్రాంతాల్లో సుముఖంగా లేకపోవడంతో నిర్మాణం కాలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోనే నిర్మాణాలు ప్రారంభించిన పేదలకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మధ్యలో నిర్మాణాన్ని వదిలేయలేక కొందరు అప్పులు చేసి నిర్మించుకుంటున్నారు. ఈ డబ్బులు ఎప్పుడు వస్తాయోనని నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. మరోవైపు అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

ఇళ్ల వివరాలు	
మొత్తం మంజూరైనవి	400
పూర్తయినవి	101
పునాది స్థాయిలోనివి	19
లెంటల్ స్థాయి	22
రూఫ్ స్థాయి	40
స్లాబు స్థాయి	45
ప్రారంభం కానివి	111
సొంత స్థలంలో నిర్మించుకొనేవారు	62

ప్రోత్సాహం దిశగా కూటమి ప్రభుత్వం

పేదలు ఇళ్లు నిర్మించుకునే క్రమంలో ఎదుర్కొనే ఇబ్బందులను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 2025 మార్చి వరకు గడువు ఇచ్చి నిర్మించుకోవాలని సూచించింది. పొదుపు సంఘాల ద్వారా రూ.35 వేలు, బ్యాంకుల ద్వారా రూ. 2 లక్షల వరకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటుంది. ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం: ఎస్.కె సల్మాన్, ఏఈ హౌసింగ్, కొండాపురం

లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం కూడా బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటుంది. నిర్మాణాలకు బిల్లులన్నీ పంపించాం.

కోవూరు
• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు



చెన్నారెడ్డిపాళెంలో పొంగళ్లు

పొదలకూరు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం పోలేరమ్మకు పొంగళ్లు పెట్టారు. గ్రామంలోని మహిళలంతా ఐకమత్యంగా నైవేద్యాలను నెత్తిన పెట్టుకొని అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాపాడాలని వేడుకున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

ఉప విద్యాశాఖాధికారి తనిఖీ

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గోపాల్ మంగళవారం ఏఎస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో దస్త్రాలు అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. సిలబస్ విషయమై ఉపాధ్యాయులతో సమీక్షించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ పాఠశాలలో దస్త్రాలు పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: విడవలూరులోని వెలుగు, ఎంఈవో కార్యాలయాలకు వెళ్లే దారి బురదమయంగా ఉంది. కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – శ్రీను, విడవలూరు

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – నగేశ్‌కుమారి, ఎంపీడీవో

? పొదలకూరు మండలం నరసింహకండ్రిక సమీపంలో పొదలకూరు-సోమశిల ప్రధాన రహదారిపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రాత్రివేళల్లో రోడ్డుపై గుంత కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. – శ్రీనివాసులు, స్థానికుడు

✓ గుంతను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. –శ్రీనివాసులు, ర.భ. ఏఈ

ప్రభుత్వ భూమి అమ్మకానికి..?



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

మర్రిపాడు, న్యూస్‌టుడే: భూఆక్రమణదారులు మర్రిపాడు మండలంలో రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూమిని విక్రయించేందుకు సిద్ధమయ్యారు. మండలంలోని చుంచులూరు రెవెన్యూలో సర్వే నెంబరు 140లో 0.70 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 0.30 ఎకరాల భూమికి సంబంధించి తమ వద్ద పత్రాలున్నాయని, తాము హక్కుదారులమని సదరు భూమిని రూ.17 లక్షలకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ముందస్తుగా రూ.2 లక్షలు కూడా తీసుకున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వ భూమి అమ్మేస్తున్నారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో రమణయ్య, సర్వేయర్, వీఆర్‌ఏ అక్కడి చేరుకుని భూమి దస్త్రాలు పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించేందుకు యత్నిస్తే చర్యలు తీసుకుంటామని డీటీ అనిల్ కుమార్ హెచ్చరించారు.

లేబూరులో భూమాయ..!

రూ.కోటి విలువైన భూమి రూ.22 లక్షలకే ధారాదత్తం చేస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

భూముల విలువలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ప్రధాన ప్రాంతాల్లో డిమాండ్ ఉండటంతో కోట్ల రూపాయల్లో ఉంది... గత వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను నాయకులు స్వాహాచేశారు.. పంచాయతీ అనుమతి, తీర్మానం లేకుండానే విలువైన స్థలాలు కాజేశారు.. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వైకాపా పాలనలో పాపాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇందుకూరుపేట మండలంలో ఒక నాయకుడు



లేబూరులో ఆక్రమించిన ప్రభుత్వ భూమి ఇదే..

అడ్డగోలుగా ప్రతిపాదనలు పంపిన అధికారులు

జిల్లాలో డెల్టా ప్రాంతం... నెల్లూరుకు అత్యంత సమీపంలో ఉన్న ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామంలో సర్వే నంబరు 360లో 1.83 ఎకరాల భూమి(రావుల దొరువు) ఉంది. పంచాయతీ పాలకవర్గం సైతం దొరువుకు వేలం నిర్వహిస్తూ ఆదాయ వనరుగా ఉంది. ఏడాది క్రితం ఆ భూమి పక్కనే ఉన్న ఒక వైకాపా నాయకుడు కన్ను దానిపై పడింది. ఎలాంటి ఆదాయం రావడం లేదని, ఖాళీగా ఉందని ప్రభుత్వ ధరకు ఇవ్వాలని దరఖాస్తు చేశారు. అనుకున్నదే తడవుగా అధికారులు మార్చి నెలలో ఎకరా రూ.12,42,368 ధర నిర్ణయిస్తూ రూ.22.73 లక్షలు చెల్లించి తీసుకోవాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దీని విలువ రూ.6.50 లక్షలుగా నిర్ణయించారు. మార్కెట్‌లో ఎకరా రూ.50 లక్షల వరకు పలుకుతోంది. విలువైన భూమిని అధికారులు కారుచౌకగా నాయకుడి కట్టబెట్టేందుకు దస్త్రం సిద్ధం చేశారు.

ప్రభుత్వ భూములను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. విలువైన స్థలాన్ని రూ.కోటి విలువైన భూమిని కాజేస్తున్నా కనీస చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేదల ఇళ్ల స్థలాలకు ఇవ్వకుండా...

గ్రామంలోని రామాలయానికి ఆనుకుని ఉన్న భూమి నిరుపేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీకి స్థానికంగా స్థలం లేక నాలుగు కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. విలువైన భూమిని గుర్తించి పేదలకు పంచాల్సిన అధికారులు ఒక నాయకుడికి కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. దీనిని నిలుపుదల చేయాలని గ్రామస్థుల నుంచి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేయాలని విన్నవిస్తున్నారు.

● తహసీల్దారు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెలలో ప్రభుత్వ ధరకు భూమి ఇవ్వాలని జులై 11న ఉన్నతాధికారులకు పత్రాలను నివేదించినట్లు తెలిపారు. తాను నెల రోజుల క్రితమే బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు.

ఏఎంసీ ఛైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి..?

మనుబోలు: మనుబోలు తెదేపా మండలాధ్యక్షుడిగా పనిచేస్తున్న గాలి రామకృష్ణారెడ్డి పొదలకూరు ఏఎంసీ ఛైర్మన్‌గా నియమించారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి పొదలకూరు ఏఎంసీ ఛైర్మన్‌గా ప్రకటించడంతో పలువురు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ప్రజా పోరాటాలతో సమస్యల పరిష్కారం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ప్రజా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేశ్ తెలిపారు. బుచ్చిలో మంగళవారం ప్రాంతీయ కమిటీ మూడో మహాసభ జరిగింది. పార్టీ జెండాను ఎగురవేసి సీనియర్‌నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేశ్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు బుచ్చిరెడ్డిపాళెం, దామరమడుగు, పెనుబల్లిలు శ్రీకారం చుట్టాయన్నారు. భూపోరాటాల ద్వారా పేదలకు భూములు పంచామన్నారు. నగర పంచాయతీలో పేదలకు కనీస మౌలిక వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అటవీ మార్గంలో ఆక్రమణలు తొలగించండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అనంతసాగరం, న్యూస్‌టుడే: గోవిందంపల్లి నుంచి అటవీ మార్గంలో, డొంకలు కొందరు ఆక్రమించారని వెంటనే ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు తహసీల్దారు వీర వసంతరావుకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం పాతాళపల్లి సచివాలయంలో రీసర్వేపై రెవెన్యూ సిబ్బంది గ్రామసభ నిర్వహించారు. గ్రామస్థులు పొలం ఆక్రమణలపై ఫిర్యాదు చేయడంతో పరిశీలించి తొలగిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

డిగ్రీ పరీక్షలకు 691 మంది గైర్హాజరు

వెంకటాచలం, న్యూస్‌టుడే: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించగా మొత్తం 9960 మంది విద్యార్థులకు 9269 మంది హాజరవగా, 691 మంది గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి మధుమతి తెలిపారు.

రీసర్వేలో తప్పులు సరిచేయండి



అధికారుల సంతకాలు ఫోర్జరీ చేశారని తహసీల్దారుకు ఫిర్యాదుచేస్తున్న రైతు

కొడవలూరు, న్యూస్‌టుడే: అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాలిచ్చారని వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు స్ఫూర్తిని తెదేపా నాయకులు దయాకర్‌రెడ్డి, రైతులు కోరారు. కొడవలూరు మండలం రామన్నపాళెంలో రీసర్వే సమస్యల పరిష్కారానికి గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల సంతకాలు ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. వారినుంచి వివరణ తీసుకున్న తహసీల్దారు విచారించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పలువురు రైతులు గత వైకాపా పాలనలో జరిగిన రీసర్వేలో పలువురికి అన్యాయం జరిగిందని తప్పులు సరిచేయాలని వినతిపత్రాలిచ్చారు.

లాభసాటి వ్యవసాయంతో రాణింపు

తోటపల్లిగూడూరు, మనుబోలు, కొడవలూరు, బుచ్చి, న్యూస్‌టుడే : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని, రబీ సీజన్‌కు సమాయత్తమవుతున్న రైతులు మేలైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏడీఏ రాజ్‌కుమార్ తెలిపారు. తోటపల్లిగూడూరు మండలంలోని వరకవిపూడి, మాచర్లవారిపాళెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెంలో అధికారులు మాట్లాడుతూ... కాలానికి అనువైన వరి రకాలు ఎంపిక చేసి విత్తనశుద్ధి చేయాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు సీఐ కార్యాలయంలో పోలీసు అమరవీరులకు స్మారకంగా రక్తదాన శిబిరం నిర్వహించగా డీఎస్పీ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల త్యాగాలు వివరించారు. కార్యక్రమంలో తెదేపా జనసేన నాయకులు, యువత ఉత్సాహంగా రక్తదానం చేశారు. సీఐ గంగాధరరావు, ఎస్సైలు జిలానీ, సాయిప్రసాద్ పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి డీఎస్పీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన



పొదలకూరు పట్టణంలోని నాగార్జున పాఠశాల వీధిలోని ఒక విద్యుత్తు స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కింది భాగం విరిగిపోయింది. ఈ స్తంభం ఎప్పుడు విరిగి మీద పడుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిస్కం ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ.. పరిశీలించి అవసరమైతే స్తంభం మారుస్తామన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

బురదదారి

విడవలూరు మండలం పొన్నపల్లి రహదారి గుంతలు, గులక రాళ్లు తేలి అధ్వానంగా మారింది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు జారి పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి రహదారి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో నగేష్ కుమారి మాట్లాడుతూ త్వరలో రోడ్డు బాగు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు



వైకుంఠధామంలో పిచ్చిమొక్కల తొలగింపు

ఈనాడు స్పందన



మండల పరిధిలోని కోదండరామపురంలోని శ్మశాన వాటికలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించారు. 'ఈనాడు'లో 'వైకుంఠధామాల్లో సమస్యల తిష్ఠ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు జేసీబీ సాయంతో తొలగించినట్లు వీఆర్వో నాగార్జున్‌రెడ్డి తెలిపారు. –న్యూస్‌టుడే, మనుబోలు

ప్రధాన మార్గం.. గోతులమయం

కొడవలూరు మండలం నార్లపరాజుపాళెం ప్రధాన రహదారిలో పెద్ద గుంత ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలున్నాయి. ఈ గుంతలో చిన్నపాటి వర్షానికి నీరు చేరడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ నాగరాజు మాట్లాడుతూ ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొడవలూరు



వైభవంగా లలిత సహస్రనామార్చన

సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో 41 రోజుల పాటు మహిళలు సామూహికంగా నిర్వహించిన లలిత సహస్రనామార్చన కార్యక్రమం మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. అనంతరం కామాక్షిదేవికి కుంకుమార్చన జరిగింది. అందరూ కలిసి లలిత సహస్రనామార్చన యాగంలో పూర్ణాహుతి సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – న్యూస్‌టుడే, సంగం



గిరిజన కాలనీలో నీటిసమస్య పరిష్కారం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎంపీపీ చొరవతో గిరిజన కాలనీలో నీటిసమస్య పరిష్కారమైంది. మండల పరిధిలోని అశ్వనీపురం గిరిజన కాలనీలో నీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి స్పందించి కాలనీలో బోరు వేసి చేతిపంపు బిగించడంతో సమస్య పరిష్కారమైందని స్థానికులు తెలిపారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించండి

కోవూరు: దీపావళి పండగను పురస్కరించుకొని బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలు పాటించాలని సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, దుకాణాల వద్ద నీటితో నిండిన డ్రమ్ములు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రంగనాథ్ గౌడ్ తదితరులున్నారు.

రాయితీ పథకాలపై అవగాహన

పొదలకూరు, సైదాపురం, న్యూస్‌టుడే : రైతులు సాగుచేసే మెట్ట, మాగాణి పైర్లలో ముందుగా విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎ.వాసు అన్నారు. మంగళవారం పొదలకూరు మండలం మరుపూరు, బిరదవోలు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌ఫాం సమన్వయకర్త వినయ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఏడుకొండలునాయక్, సాయిగణేష్, వీహెచ్‌ఏ విజిత పాల్గొన్నారు. రైతులకు అందించే వివిధ రాయితీ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాసులు సూచించారు. సైదాపురం మండలంలోని లింగనపాళెం, మర్లపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది సభను ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే : అనంతపురం జిల్లా కూడేరు మండలం శివరాంపేట వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన ఇద్దరు యువకులు మృతి చెందారు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన వినోద్ (22), సింగంపల్లికి వాసి అశోక్ (21) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఇదే ప్రమాదంలో గాయపడిన కూడేరుకు చెందిన మరో యువకుడు దామోదర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు శవ పరీక్ష చేయించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనారోగ్యంతో వృద్ధుడి బలవన్మరణం

సంగం, న్యూస్‌టుడే: మండల పరిధిలో కొరిమెర్ల గ్రామంలో మంగళవారం రాఘవులు (71) అనే వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రాఘవులు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉదయాన్నే అల్పాహారం తీసుకొస్తానంటూ ఇంటి నుంచి వచ్చిన ఆయన చెరువు గట్టు వద్ద గడ్డి నివారణ మందు తాగి కుప్పకూలారు. పశువుల కాపరుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయన్ను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందారు. సంగం పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

మృతదేహం గుర్తింపు

సంగం, న్యూస్‌టుడే: వెంగారెడ్డిపాళెం సమీపంలో మంగళవారం సాయంత్రం నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి పక్కనే గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై రాజేశ్ సిబ్బందితో కలసి విచారించారు. యాచకుడై ఉండొచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

సంగం, పొదలకూరు, న్యూస్‌టుడే: సంగం మండలంలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి.. వివరాలిలా ఉన్నాయి... ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్న కారు పెరమన సమీపంలో మంగళవారం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారు పల్టీలు కొడుతూ ఆగడంతో అందులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని వేరే వాహనంలో ఎక్కించి సంగంకు తరలించారు.

● సంగం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన నెల్లూరు-ముంబయి జాతీయరహదారిపై జరిగిన ప్రమాదంలో కడప జిల్లా బద్వేలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. షేక్ బాషా, పీరా అనే వారిద్దరు ద్విచక్రవాహనంలో నెల్లూరుకు వెళ్లే క్రమంలో ముందుగా వెళుతున్న ద్విచక్రవాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపుతప్పి కింద పడ్డారు. సంగం ఎస్సై పి.రాజేష్ సంగంలో వైద్య చికిత్స చేయించారు.

● పొదలకూరు స్వర్ణ లేఅవుట్ సమీపంలో మంగళవారం రాత్రి మరుపూరు గ్రామానికి చెందిన మహబూబ్ బాషా అనే యువకుడు ఆవులను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. మహబూబ్‌బాషా ద్విచక్ర వాహనంపై పొదలకూరు నుంచి మరుపూరుకు వెళుతూ రాత్రి రోడ్డుపై ఉన్న ఆవులను గుర్తించక ఢీకొట్టడంతో అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఉత్సవాలు



గ్రామ చావిడి ప్రాంతంలో విద్యుద్దీపాలంకరణ

సైదాపురం, న్యూస్‌టుడే : సైదాపురం ప్రజల ఆరాధ్యదైవం.. కోరిన వరాలనిచ్చే కల్పవల్లి.. పోలేరమ్మతల్లి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చావిడి ప్రాంతంలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి అమ్మవారి నిలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని అన్ని వీధులను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసి వివిధ దేవతామూర్తుల విద్యుత్తు ప్రతిమలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

భూ సమస్యలపై తహసీల్దారుకు వినతి

సైదాపురం, న్యూస్‌టుడే : మండలంలోని జోగిపల్లిలో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించాలంటూ అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందించారు. గ్రామంలోని పేదల భూములను భూస్వాములు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

కనీస వసతులు కల్పించండి

రాపూరు, న్యూస్‌టుడే : రాపూరులో చల్లా యానాదులు మంగళవారం మండల పరిషత్తు కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా నివాసముంటున్నా రేషన్‌కార్డులు గాని, ఆధార్ కార్డులు లేవన్నారు. ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఎంపీడీవో భవానికి వినతిపత్రం అందజేశారు.

కుమారుడు వేధిస్తున్నాడని ఆవేదన

విడవలూరు, న్యూస్‌టుడే: పొలం విషయంలో కుమారుడు వేధిస్తున్నాడని తల్లి వాపోయింది. విడవలూరులో మంగళవారం మాట్లాడుతూ.. . కోవూరులో నివాసముంటున్న వెంకటరమణమ్మకు చెందిన నాలుగెకరాల పొలం విడవలూరు మండలం దండిగుంటలో ఉంది. ఇద్దరు కుమార్తెలకు పసుపు కుంకుమకింద చెరో రెండెకరాలిచ్చారు. కుమారుడు గడ్డం సుబ్బారావుకు ఉన్న ఆస్తిని ఇచ్చారు. దండిగుంటలో ఉన్న పొలం గాదెల దిన్నెకు చెందిన సురేంద్రకు కౌలుకిచ్చారు. ఈ క్రమంలో సుబ్బారావు పొలం తనకివ్వాలని కన్నతల్లిని వేధిస్తూ, కౌలుకిచ్చిన పొలంలో నాట్లు వేయకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారని తల్లి వాపోయింది. వేధింపులు తాళలేక ఇద్దరు కుమార్తెలతో విడవలూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

రోడ్ల విస్తరణకు శ్రీకారం!

వైకాపా పాలనలో అయిదేళ్లుగా పట్టించుకోని వైనం

న్యూస్‌టుడే, విడవలూరు, కొడవలూరు

వైకాపా పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి.. కనీసం మరమ్మతులు చేయాలని కోరినా స్పందించిన దాఖలాలు లేవు.. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి సమయాల్లో గుంతల్లో పడి పలువురు మృతిచెందినా పట్టించుకోలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజల్లో అభివృద్ధి ఆశలు చిగురించాయి. కోవూరు నియోజకవర్గంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

బుచ్చి నుంచి ఊటుకూరు వరకు...

● విడవలూరు మండలం ఊటుకూరు- బుచ్చిరెడ్డిపాలెం 29 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి(సీఆర్‌ఐఎఫ్)కింద కేంద్ర ప్రభుత్వం రూ.49 కోట్లు మంజూరు చేసింది. దీంతో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్డు నిర్మాణం పూర్తయితే బుచ్చి, కొడవలూరు, విడవలూరు మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది.



కొడవలూరు రైల్వే గేటు వద్ద రోడ్డు దుస్థితి

● ఇందుకూరుపేట మండలం నరసాపురం నుంచి మైపాడు రోడ్డు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు ఇటీవల ప్రారంభించారు. రైతులు, మత్స్యకారులు, పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

● విడవలూరుకు చెందిన చెముకుల శ్రీనివాసులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోవూరు నియోజకవర్గంలో పలుచోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. బుచ్చి-ఊటుకూరు రోడ్డు విస్తరణ చేపడితే ప్రజలకు ఉపయోగ పడుతుందన్నారు. ఊటుకూరు నుంచి అన్నారెడ్డిపాలెం వరకు.. పార్లపల్లి, కొడవలూరు రైల్వే గేటు వరకు రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

భూ సేకరణ పూర్తిచేయండి


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టులకు త్వరితగతిన భూ సేకరణ చేపట్టాలని జేసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూసేకరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే, ఆర్వోబీలు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల భూసేకరణ పూర్తి చేసి పనులు పురోగతి సాధించేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారులు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీవోలు నాగసంతోష్, అనూష, పావని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

ప్రతి గర్భిణికి అన్నిరకాల పరీక్షలు తప్పనిసరి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ప్రతి గర్భిణిని గుర్తించి పేరు నమోదు చేయాలని, అన్ని రకాల పరీక్షలు తప్పనిసరిగా చేయాలని డీఎంహెచ్‌వో పెంచలయ్య తెలిపారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాతా శిశు మరణాల సబ్‌కమిటీ సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. రెండు నెలల్లో సంభవించిన రెండు మాతృ, 12 శిశు మరణాలకు గల కారణాలు, లోపాల గురించి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. హై రిస్క్ గర్భిణులను గుర్తించడం, సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించి, ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం జరిగే వరకు సంబంధిత ఆరోగ్య పర్యవేక్షకులకు పూర్తి బాధ్యత అప్పగించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ సింధు, డాక్టర్ సంధ్య, ఎస్పీహెచ్‌వో డాక్టర్ దయాకర్, డీపీఎంవో డాక్టర్ రమేష్, డెమో కె.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నేటి నుంచి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు


శ్రీ సౌభాగ్య సరస్వతి అమ్మవారి ఆలయం

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం): పప్పుల వీధిలో పునర్నిర్మించిన శ్రీ సౌభాగ్య సరస్వతి అమ్మవారి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ- కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం నుంచి అయిదు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో కర్తాళం శ్రీ సిద్ధేశ్వర పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాల్గొంటున్నట్లు ఆ పీఠ ఆస్థాన పండితులు రమేశ్‌శర్మ తెలిపారు. బుధవారం కర్తాళం పీఠాధిపతి నెల్లూరు రాక సందర్భంగా స్వాగత కోలాహలం, 24న మహిళలచే పెన్నానది తీర్థ సేకరణ శోభా యాత్ర, అంకురార్పణ, 25న ప్రతిష్ఠించే విగ్రహాలకు తైలాధివాసం, అభిషేకం, ధాన్యాధివాసం, 26న యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు, మహాకుంభాభిషేకం, 27న ప్రతిష్ఠించిన దేవతామూర్తులకు ఏకకాలం కల్యాణ మహోత్సవాలతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

ఏటా అదే సమస్య

చిన్నపాటి వర్షానికే అండర్‌బ్రిడ్జిల కింద రాకపోకలకు అంతరాయం ఏళ్లుగా నెలకొన్న సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. చిన్నపాటి వర్షం వస్తేచాలు అండర్‌బ్రిడ్జిల కింద రాకపోకలు నిలిచిపోతూ.. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా రైల్వేగేట్ల వద్ద వంతెనలు నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
– న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)


ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి కింద నీటిలో నిలిచిన ఆటో (పాత చిత్రం)

నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేటు వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జి, రామలింగాపురం, మాగుంటలేఅవుట్‌ల వద్ద అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. రంగనాయకులపేట, విజయమహల్ రైల్వేగేటు, కొండాయపాళెం గేటు, బీవీనగర్, వేదాయపాళెంల వద్ద రైల్వేగేటులున్నాయి. నగరంలోని మినీ బైపాస్ రోడ్డు తూర్పు ప్రాంతాలతో పాటు జిల్లాలోని ఇతర చోట్ల నుంచి వచ్చే ప్రయాణికులు రైల్వే ట్రాక్‌కు మరోవైపు ట్రంకు రోడ్డు వైపునకు వెళ్లాలంటే అండర్‌బ్రిడ్జిలు, రైల్వేగేట్లు మీదుగా రావాల్సిందే. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు, వాహనాలు అటూ ఇటూ రాకపోకలు సాగిస్తుంటారు.

ఆత్మకూరు బస్టాండ్ వద్దే ఎక్కువ

వర్షాకాలంలో అండర్‌బ్రిడ్జిల వద్ద నీరు నిలిచి పోవడంతో వాహనదారుల అవస్థలు అన్నిఇన్నీ కావు. డ్రైనేజీ పొంగడం, సమీప ప్రాంతాల నుంచి నీరు అండర్ బ్రిడ్జిల వద్దకు చేరడంతో సమస్య తలెత్తుతోంది. రైల్వేగేట్ల మీదుగా వెళదామంటే ట్రాఫిక్ పెరిగిపోయి వాహనాలు బారులు తీరడం, గంటలు తరబడి నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా ఆత్మకూరు బస్టాండ్ వద్ద నీరు వచ్చిందంటే రంగనాయకులపేట రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్‌తో ఇబ్బంది పడే కంటే వంతెన కింద వెళ్లే ప్రయత్నం చేయగా.. వాహనాలు నిలిచిపోయి మరమ్మతులకు గురవుతున్నాయి. ఆటోలు, కార్లతోపాటు ఒక్కోసారి బస్సులు నిలిచిపోతున్నాయి.

ప్రమాదకరంగా ప్రయాణం

వంతెన వద్ద పాదచారుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. గోడలను పట్టుకుని ప్రమాదకర పరిస్థితుల్లో వెళుతున్నారు. కొండాయపాళెం, బీవీనగర్ రైల్వే గేట్లు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. స్థల సేకరణ సమస్య కారణంగా కార్యరూపం దాల్చలేదు. అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలువకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని, రైల్వే వంతెనలు నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు.


వంతెన వద్ద పాదచారుల అవస్థలు (పాత చిత్రం)

సభ్యత్వ నమోదు సవాలుగా తీసుకోండి


మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదును సవాలుగా తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ తెదేపా సభ్యత్వ నమోదు శిక్షణ సదస్సు నగరంలోని మాగుంటలేఅవుట్ రూరల్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు కష్టాల్లో తెదేపాలో చేరిన కార్యకర్తలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలకు గౌరవం తగ్గకుండా చూసుకుంటున్నారు. తెదేపాలోకి వచ్చిన తనని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కున చేర్చుకున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిరియానీ హోటల్ తనిఖీ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరం ఆచారివీధిలోని రియాజ్ బిరియానీ హోటల్‌ను నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తనిఖీ చేశారు. ఆహార నాణ్యతపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మంగళవారం తనిఖీ చేపట్టారు. వంటశాల, స్టోర్ రూములో నిర్దేశించిన ప్రమాణాలను పాటించడం లేదని గుర్తించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఆరోగ్యాధికారి చైతన్య

ఇళ్లచుట్టూ మురుగు

నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోని మనుమసిద్ధినగర్‌లో ఇళ్ల చుట్టూ మురుగు చేరి ప్రజలను ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఎటూ పోలేక ఇళ్ల చుట్టూ చేరింది. ఇవి కొన్ని రోజులుగా నిల్వ ఉండటంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వస్తోంది. సాయిభాస్కర్ స్కూల్ సమీపంలో పాఠశాల, భవనాలను మురుగు చుట్టుముట్టింది. దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య మురుగు నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీ నగర్)



తాగునీరు వృథా



నగరంలోని పోలీసుకాలనీ వినాయక గుడి వద్ద తాగునీరు వృథాగా పోతోంది. తాగునీటి పైపు వదులై కొన్నిరోజులుగా నీరంతా కాలువ పాలవుతోంది. గతంలో కూడా ఇక్కడ ఇదే సమస్య నెలకొంది. సిబ్బంది బాగుచేశారు. మళ్లీ సమస్య తలెత్తింది. అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిష్కరిస్తామని నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

కాలువలో పూడికతీత

నెల్లూరు నగరం నిప్పోసెంటరు సాయిబాబా గుడి వద్ద కాలువ పూడికతో నిండిపోయింది. మురుగునీటితో పాటు వర్షపునీరు ప్రధాన జీఎన్‌టీ రోడ్డుపై చేరుతోంది. పాదచారులు, వాహన చోదకులు, భక్తులు ఇక్కట్లకు గురవుతున్నారు. సమస్యపై 'ఈనాడు'లో 'నిలిచిన నీరు.. ప్రజలకు ఇక్కట్లు' శీర్షికన సోమవారం చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య కాలువలో పూడిక తీయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. – న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



స్పందనకు వందనం

వీధిలో చెత్త తొలగింపు

నెల్లూరు నగరంలోని జెండావీధి ఆంధ్రా బ్యాంకు సమీపంలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. చెత్తాచెదారం కుళ్లి దుర్గంధం వస్తోందని, వ్యాధులు పొంచి ఉన్నాయని స్థానికులు వాపోయారు. సమస్యపై మంగళవారం 'ఈనాడు'లో వారం రోజులైనా చెత్త తీయరా? శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



ఉద్యోగ మేళాలో 33 మంది ఎంపిక



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయూమ్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయూమ్ మాట్లాడుతూ ఉన్నత విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులు ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మేళాకు 88 మంది హాజరుకాగా.. 33 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వినయ్‌కుమార్, సీడాప్ జేడీఎం హైమావతి, డీకే కళాశాల ప్రిన్సిపల్ డి.గిరి, స్కిల్ హబ్ ఇన్‌ఛార్జి శ్రీరంజిని, ఉమా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కమిషనర్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ అదనపు కమిషనర్‌గా వై.ఓబులేసు నందన్ మంగళవారం కార్యాలయంలోని ఛాంబరులో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఒ.ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు.

ముందస్తు దీపావళి వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం): నగరంలో దీపావళి ముందస్తు వేడుకలు ప్రారంభమయ్యాయి. గిడ్డంగి వీధిలోని కల్యాణవేదికలో కామాటివీధి శ్రీగోదాదేవి భజన మండలి అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి ఎస్.కామాక్షి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సంగీత, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

యువకుడిపై కత్తితో దాడి

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటనపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. పొదలకూరు రోడ్డు న్యూ ఎస్‌బీఐ కాలనీలో యాసిర్ నివాసం ఉంటున్నారు. ఆయనకు శ్రామికనగర్‌కు చెందిన బ్రహ్మానాయుడుతో పాత కక్షలు ఉన్నాయి. ఈ నెల 21న యాసిర్ తన పుట్టిన రోజు సందర్భంగా శ్రామికనగర్‌లోని స్నేహితులను కలిసేందుకు వెళ్లారు. మాట్లాడుకుందామని రావాలని బ్రహ్మానాయుడు, అతని భార్య యాసిర్‌ను ఇంటికి పిలిచారు. ఇంటికి రాగానే బ్రహ్మానాయుడు కత్తితో అతనిపై దాడి చేసి గాయపరిచారు. అతన్ని స్నేహితులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీ కేసులో ఇద్దరు బాల నేరస్థుల అరెస్టు

నెల్లూరు(నేర విభాగం): చోరీ కేసులో ఇద్దరు బాలలను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి కథనం మేరకు.. సంతపేట మార్కెట్ సెంటరులో షేక్ నూరి కుటుంబం నివాసం ఉంటోంది. ఈ నెల 13న ఆమె ఇంటికి తాళం వేసి గుడికి వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారం, వెండి వస్తువులను దోచుకెళ్లారు. ఆమె ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. సాంకేతికత ఆధారంగా చోరీకి పాల్పడింది ఇరుకళల పరమేశ్వరి దేవాలయం, ఈద్గామిట్ట ప్రాంతాలకు చెందిన ఇద్దరు బాలలుగా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకుని 630 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. జువనైల్ జస్టిస్ బోర్డు ద్వారా వారిని తిరుపతిలోని హోంకు తరలించారు.

యువతిని మోసం చేసిన యువకుడి కోసం గాలింపు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆ తర్వాత మొహం చాటేసిన వ్యక్తి కోసం వేదాయపాలెం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై రెండు నెలల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. అతని కోసం పోలీసులు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు వద్దు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: తమ ప్రాంతంలో మద్యం దుకాణం తొలగించాలని శ్రీనివాస్ నగర్ వాసులు చేపట్టిన ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. అధికారులు స్పందించి మద్యం ఇక్కడి నుంచి తొలగించాలని స్థానిక మహిళలు కోరారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: బాలిక అదృశ్యంపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. పాత వేదాయపాలెంలో ఓ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తె ఈ నెల 21న దుస్తులు ఐరన్ చేయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినాఫలితం లేకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారు.

చిన్నారుల వ్యాసం.. స్ఫూర్తికి సందేశం

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు



నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలోని మూడు పాఠశాలల్లో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు పాఠశాలల స్థాయిలో పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఆచారివీధిలోని సాయి సరస్వతి ఇంగ్లీషు మీడియం స్కూల్లో జరిగిన పోటీల్లో ఎస్.రోహిత్ ఆచారి, భవన సుతర్, తుషర చౌదరి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.సాయికుమార్, డైరెక్టర్ సుజన పాల్గొన్నారు.


అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్లో..

నెల్లూరు(ఏసీ నగర్): బ్రంహ్మానందపురంలో ఉన్న అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్లో జరిగిన పోటీల్లో మొదటి స్థానంలో బి.జాహ్నవి, ద్వితీయ స్థానంలో వి.ఇవాంజెలిని, తృతీయ స్థానంలో ఈ.ఇసాక్‌జస్టిస్ నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ పి.కృష్ణచైతన్య, ఛైర్మన్ పి.బాబునాయిడు, ప్రిన్సిపల్ ఎం.శ్వేత, వైస్ ప్రిన్సిపల్ సురేష్ పాల్గొన్నారు.



లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో..

నెల్లూరు(విద్య): మూలాపేట లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో పోటీలు జరగ్గా.. మొదటి స్థానంలో వి.మునితారకరామారావు, ద్వితీయ స్థానంలో వి.చైత్రిక, తృతీయ స్థానంలో ఎస్‌కే సాహిస్తాఅంజూమ్ నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు, రాజేష్, అకడమిక్ ఇన్‌ఛార్జి జరీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: హౌసింగ్‌బోర్డు కాలనీలో నగరపాలక సంస్థ సిబ్బంది మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం లేదు. మురుగునీరు దుర్గంధం వస్తోంది. – సుధాకర్

సమాధానం: కాలువలు శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? మూలాపేట బట్వాడిపాళెం మదరసా వద్ద రోడ్డుపై పశువులు గుంపులుగా చేరుతున్నాయి. వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి. – షానవాజ్

✓ పశువులను గోశాలకు తరలించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? నవాబుపేట మార్కెట్ యార్డ్ ఎదుట రోడ్డు పక్కన తాగునీటి పైపుల వాల్వు నుంచి నీరు వృథాగా పోతోంది. – రమేష్

✓ నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? చంద్రమౌళినగర్ ప్రాంతంలోని ప్రధాన మార్గంలో పెద్దఎత్తున చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా చేయాలి. – అనిల్

✓ చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– నెల్లూరు(నగరపాలకసంస్థ, నవాబుపేట)

తెరపై ఈనాడు

ఎం–1 సినిమాస్– స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. వెట్టయ్యన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1.. వెట్టయ్యన్, స్క్రీన్2.. జనక ఐతే గనక, స్క్రీన్3.. ది వైల్డ్ రోబోట్, స్క్రీన్4.. విశ్వం, స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1.. దేవర, దివైల్డ్ రోబోట్, విశ్వం, స్క్రీన్2.. విశ్వం, దేవర, స్క్రీన్3.. వెట్టియ్యన్, స్క్రీన్4.. విశ్వం, లవ్‌రెడ్డి, సిరిమల్టీప్లెక్స్.. స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. వెటయ్యన్, విశ్వం స్క్రీన్3.. విశ్వం, వెట్టయ్యన్, స్క్రీన్4.. జనక అయితే గనక

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఎవరైనా తమ కెరీర్‌ను సాధించుకోవాలంటే కృషి, పట్టుదలతో పాటు వారికి ఇష్టమైన రంగాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా యూత్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పీఎంపీ సహకారంతో బుజబుజ నెల్లూరులో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది.

అద్దె బస్సుల యాజమాన్య సమస్యలపై చర్చ


మాట్లాడుతున్న ఈడీ వెంకటేశ్వరరావు

నెల్లూరు(రవాణా): ఆర్టీసీ నెల్లూరు జోన్ పరిధిలో అద్దె బస్సులను నిర్వహించే ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్టీసీ జోనల్ ఈడీ వెంకటేశ్వరరావు మంగళవారం కాకుటూరులోని జోనల్ శిక్షణ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జోనల్ స్థాయిలో అద్దె బస్సుల యజమానులకు సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. అద్దె బస్సుల యాజమాన్యాలు సైతం ప్రయాణికుల క్షేమం, సంస్థ అభివృద్ధికి కలిసి పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మురళీబాబు, డిప్యూటీ సీటీఎం షమీమ్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్, జోన్ పరిధిలోని అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం నగరంలోని డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని యాజమాన్యాలలో పండిట్‌లు, పీఈటీల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తే.. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న వీరిని అప్‌గ్రేడ్ చేయక పోవడం దారుణమన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు, ప్రధానోపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, జిల్లా కోశాధికారి మురళీధర్‌రావు, నాగిరెడ్డి, సురేంద్రబాబు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయండి


నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఛాంబరులో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ, ఉద్యానశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు సత్యవాణి, రమేష్‌నాయక్, సుబ్బారెడ్డి, అనిత పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కొనుగోలుకు బేరసారాలు

● కావలికి చెందిన వ్యక్తి మద్యం దుకాణాల కోసం రూ.2లక్షలు వెచ్చించి దరఖాస్తు చేశారు. లక్కీ డ్రాలో అతని పేరు వచ్చింది. నెల్లూరు గ్రామీణంలో దుకాణాన్ని కైవశం చేసుకున్నారు. అదే దుకాణాన్ని రూ.21లక్షలకు విక్రయించాడు.

● సర్వేపల్లి నియోజకవర్గంలో వ్యక్తి మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకోగా డ్రాలో పేరు వచ్చింది. ప్రస్తుతం ఆ దుకాణం కోసం బేరసారాలు జరుగుతున్నాయి. మద్యం వ్యాపారులు రూ.20 లక్షలు అడుగుతుండగా.. రూ.30 లక్షలు చెబుతున్నాడు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (బీవీ నగర్, ఏసీ నగర్)



జిల్లాలో మద్యం దుకాణాల కొనుగోళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో 182 మద్యం దుకాణాలకు ఇటీవల లాటరీ జరిగిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి ప్రైవేటు మద్యం దుకాణాలు తెరపైకి తెచ్చింది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానించింది. అన్ని నియోజకవర్గాల్లో 182 మద్యం దుకాణాలకు 3,890 దరఖాస్తులు వచ్చాయి. వీటిని లాటరీ తీశారు. లక్కీ డ్రాలో పేరు రాని వారు లాటరీలో

రంగంలోకి రాజకీయ నాయకులు

దక్కించుకున్న వారికి ఎర వేస్తున్నారు. ఈ క్రమంలోనే దుకాణాల కోసం వేలం ప్రారంభించారు.

ప్రాంతానికో ధర

వ్యాపారం ఎక్కువ జరిగే దుకాణానికి భారీగా ధర పలుకుతోంది. నగరం, నెల్లూరుగ్రామీణ పరిధుల్లో రూ.లక్ష నుంచి రూ.కోట్లలోనే ధర పలుకుతోంది. మిగతా నియోజకవర్గాల్లో ఆ ప్రాంతం బట్టి వ్యాపారం జరుగుతోంది. రోజుకు రూ.లక్షల్లో కౌంటర్ అయితే ఒక ధర, రూ.లక్ష నుంచి రూ.10లక్షల్లోపు అయితే మరో ధర ఇలా వ్యాపారం సాగుతోంది. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు సైతం పావులు కదుపుతున్నారు. లక్కీ డ్రాలో వచ్చిన దుకాణాన్ని విక్రయించడం ఇష్టం లేదంటే నాయకులు జోక్యం చేసుకుంటున్నారు. ఎలాగైనా వారిని ఒప్పించేలా చేస్తున్నారు.

నాలుగు కంప్యూటర్లు అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో మానసిక దివ్యాంగుల వినియోగార్థం మునగ వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, పేర్ల సీతారామారావు రూ.1.70 లక్షల విలువజేసే నాలుగు కంప్యూటర్లను అందజేశారు. నగరంలోని రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సబ్ కమిటీ సభ్యులు సోము భక్తవత్సలరెడ్డి, కొల్లు రాఘవరెడ్డి ద్వారా అందజేసిన కంప్యూటర్లను స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ ఎంవీ సుబ్బారెడ్డి, సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు ప్రారంభించారు.